# వడ్డాణం

బాపు బొమ్మన్నా, బాలమురళి కచ్చేరీలన్నా, భానుమతి కంఠం అన్నా, శ్రీశ్రీ కవిత్వమన్నా, సి.నా.రె. ఉపన్యాసమన్నా ఎంత ఇష్టమో, ఉగాది పండగంటే నాకంత ఇష్టం. ఉగాది పచ్చడి పుల్ల పుల్లగా, తియ్య తియ్యగా, చిరుచేదుగా ఒక విధమైన కమ్మని రుచితో ఎంతో బావుంటుంది. పైగా ఏడాదికొక్కసారే చెయ్యడం వల్లనేమో మరీ మరీ బాగున్నట్టనిపిస్తుంది. రెండోది నా ఎనిమిదో ఏట నాన్న అమ్మకోసం వడ్డాణం చేయించి ఉగాదినాడు ఆమెకిస్తే అది పెట్టుకున్న అమ్మ మొహంలోని ఆనందరేఖ ఇప్పటికీ మర్చిపోలేను. అమ్మ వడ్డాణం పెట్టుకున్నాక, నాకూ కావాలని అడిగాను. 'నీ పెళ్ళికి చేయిస్తాంలే' అంది అమ్మ. 'అన్ని రోజులే' అన్నాను. 'అయితే వెంటనే పెళ్ళి చేసెయ్యమంటావా?' నవ్వింది అమ్మ. అలా ఆ రోజు అమ్మ ఒయ్యారంగా ఆ వడ్డాణం పెట్టుకొని బొబ్బట్లూ, పులిహోరా చేసి అందరికీ వడ్డిస్తూ ఉంటే సాక్షాత్తూ మోహిని దేవతలకు అమృతం వడ్డిస్తూన్నట్టు కనిపించింది. ఆమె స్థానంలో నన్ను ఊహించుకొని ఎంత సంబరపడిపోయానో! పండగ పండగకీ ఎందుకనో అమ్మ ఆ వడ్డాణం పెట్టుకునేది కాదు. ఒక్క ఉగాదికి మాత్రం పెట్టుకునేది. దసరాపండగ నవరాత్రులు తొమ్మిది రోజులూ పెట్టుకొనేది. కొంచెం కొంచెం ఎదుగుతు న్న కొద్దీ నాకు తెలిసిందేమిటంటే నాన్న ఆ వడ్డాణం చేయించడానికి చిట్టీలు కట్టి, కొంత అప్పుచేసి మరీ చేయించారట, అమ్మ సరదా తీర్చడానికి. ఆ అప్పులు తీర్చుకునేలోపలే అన్నయ్య మెడికల్ ఎంట్రెన్స్ పరీక్షలకీ పుస్తకాలకీ, తమ్ముడు ఇంజనీరింగ్ కోర్సులకీ ఇలా ఏవేవో ఖర్చులు పెరిగిపోయాయి.

నాన్న జీతం ఇంట్లో సరిపోయేది కాదు. దానికి తోడు బామ్మ జబ్బూ, మరణం అన్నీ ఒకదానికొకటి గోరుచుట్టుమీద రోకటిపోటులా వచ్చి పడి, అమ్మవడ్డాణం అమ్మేసేదాకా వచ్చింది పరిస్థితి. అంతలోనే చెల్లాయికూడా కాలేజీ చదువుకందుకుంది. దాంతో నాకు పెళ్ళిచెయ్యడం నాన్నకి పెద్ద సమస్యే కూర్చుంది. అప్పటికే నేను బి.ఏ. ప్యాసయి ఏడాది దాటిపోయింది. నా పెళ్ళికోసం నాన్న దిగులు పడిపోతున్నారు. నాన్న దిగులు అమ్మని క్రుంగదీస్తోంది. ఏమిటో? నా పెళ్ళి గురించి వారలా దిగులుగా మాట్లాడుకుంటున్నప్పుడల్లా, ఆకాశానికి నల్లమబ్బులు చుట్టుకుంటున్నట్టు నా మనసు చీకటితో నిండిపోయేది. ఎటువంటి సంబంధమొచ్చినా కట్నం దగ్గర బేరాలతో నాన్న గుండె జారిపోయేది. 'నాకీ పెళ్ళి గొడవలు ఇష్టంలేదమ్మా. హాయిగా ఉద్యోగం చేస్తాను, మీకు తోడుగా వుంటాను' అనేదాన్ని! 'భలేదానివే. పెళ్ళిమానేసి నువ్వు మాకు ఉద్యోగంచేసిపెట్టి ఉద్ధరిస్తానంటావ్! మమ్మల్ని చూసుకోవడానికి

అన్నయ్యా తమ్ముడూ లేరూ? నీ పెళ్ళీ, చెల్లెలి పెళ్ళీ చేసేస్తే మాకింకేం సమస్యలున్నయ్?' ఎంతో ఆత్మవిశ్వాసంతో చెప్పే అమ్మ మాటలు వింటూంటే ఇంకేమనాలో, ఎలా చెప్పాలో తెలీక మూగదానిలా ఉండిపోయేదాన్ని. ఒక రోజు మా మెడ్రాసు మామయ్య ఒక సంబంధం తెచ్చాడు. పిల్లాడు 'అన్నపూర్ణా ఆయిల్ మిల్స్'లో సేల్స్ ఆఫీసరుగా ఉన్నాడనీ, జీతం కూడా బాగానే వుందనీ, కట్నం తీసుకునే పెళ్ళి తనకొద్దంటున్నాడనీ చెప్పాడు. అంతే- ఆరోజు అమ్మనాన్నలు లంకెబిందెలు దొరికినంత సంతోషించారు. వెంటనే మామయ్య పెళ్ళిచూపులు ఏర్పాటు చేశాడు. కట్నం వద్దన్నారు కానీ లాంఛనాలన్నీ సరిగ్గా వుండాలని చెప్పారు. అత్తగారికీ, ఇద్దరు ఆడపిల్లలకీ పట్టుచీరలు, అబ్బాయికి కెంపుల ఉంగరం, వెండికంచాలూ, గ్లాసులూ, వెండిదీపాలూ, వెండికాళ్ళు కడుగుపళ్ళెం, వెండిపూజా వస్తువులు ఇలా ఏవేవో! 'ఓస్. ఇంతేకదా కట్నం తీసుకోవడం లేదు కదా! అన్నీ కలిపి ఆ మాత్రం అడగడం సబబే' అంది అమ్మ. అవునన్నారు నాన్నగారు. అయితే అవన్నీ కొన్నాక, తీరిగ్గా లెఖ్ఖలు చూసుకుంటే ఖర్చులన్నీ కలిపి అంతకాడికే వచ్చింది, అవ్వ పేరే ముసలమ్మలా! దాంతో నాన్నగారి అప్పులు రెండు లకారాలు ఎక్కువయ్యాయి. అయితే మంచి అత్తగారూ, మామగారూ, మంచి భర్త, మంచి ఇంట్లో పడిందని సమాధాన పడ్డారిద్దరూనూ. పెళ్ళి ఫిబ్రవరిలో జరిగింది. ఏప్రిల్‌లో మొదటి ఉగాది పండగ. వియ్యపురాలికి పట్టుచీరా, వియ్యంకుడికి ప్యాంటూ, షర్టూ, మావారి అక్కయ్యలకీ బావగార్లకీ బట్టలూ, శ్రీవారికి కొత్తల్లుడు కదా, బట్టలూ మరో పచ్చరాళ్ళ ఉంగరం ఇలా పదిపదిహేనువేల ఖర్చు. నాకెందుకో అమ్మ బోసినడుము ప్రతీ ఉగాదికీ జ్ఞాపకమొచ్చేది. 'నీకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేకపోయాను. పెళ్ళికి వడ్డాణం చేయించాలని ఎంత అనుకున్నానో' బాధపడేది అమ్మ. మా సంభాషణలు విన్నా వినబడనట్టు మౌనంగా వుండేవారు నాన్న. అలా అయిదారు ఉగాదులు దాటినా, వడ్డాణం ప్రస్తావన మాత్రం పంచాంగ శ్రవణంలా ప్రతియేటా జరిగేది!' మా అత్తగారికి వడ్డాణముంది. ఒక్క రోజుకూడా పెట్టుకోదు. కూతుళ్ళని పెట్టుకోమని ప్రాణం తీస్తుంది. 'అది ఫ్యాషన్‌కాదు. అమ్మి పారేసేయ్. అప్పలమ్మలాగా వడ్డాణం, కడియాలూ ఏమిటి' అంటూ కొట్టి పారేసేవారు ఆడపడుచులిద్దరూ. ఉండబట్టలేక ఒక ఉగాదికి 'అత్తయ్యా! పోనీ మీ వడ్డాణం నేను పెట్టుకోనా?' అడిగాను నోరుతెరిచి. 'బ్యాంకులో వుందే తల్లీ! అయినా ఇప్పుడు ఫ్యాషను కాదటగా. ఎందుకూ మరీ, నాంచారమ్మలా' అని మాటదాటేసేది అత్తయ్య. ఆ తరవాత ఎందుకో ఉబలాటం తట్టుకోలేక ఒకరాత్రి భర్తగారు మంచి మూడ్‌లో వున్నప్పుడు అడిగాను. 'ఏమండీ! ఈ సారి ఉగాదికి నాకు చీరొద్దు. వడ్డాణం చేయించ' మని! నా కోరికకు మావారు విస్తుపోయారు. 'ఇదేం పిచ్చి కోరిక? మా అమ్మే పెట్టుకోదు! మా బామ్మ పెట్టుకునేది. ఆ కాలంలో ధోవతీమీద బెల్టుకట్టుకొని, నల్లకోటు వేసుకొని కోర్టుకెళ్ళే వకీళ్ళలా. అయినా సరదాపడుతున్నావు కదా - రేపు ఉగాది పండగకి తగిలించుకుందువుగాని. అమ్మనడుగుతాను' అన్నారు. 'పోన్లే. ఒక్కరోజైనా అలా

పెట్టుకు తిరిగి తీసెయ్యొచ్చు. ఆ సరదా తీరిపోతుంది, అనుకున్నాను. మావారు పొద్దున్నే వెళ్ళి వాళ్ళమ్మతో చెప్పారు, ఆమె తప్పకుండా ఇస్తుందన్న నమ్మకంతో. ఆమె 'ఒరేయ్! అది నాకు అపురూపమైన బహుమతి. మీనాన్నిచ్చారు. దాన్ని నా తదనంతరం స్త్రీధనం కింద నా కూతుళ్ళకిస్తాను గానీ కోడలికేమిటి?' అంటూ 'లా' పాయింట్ మాట్లాడింది. దాంతో, కిమ్మనకుండా మావారు తేలుకుట్టిన దొంగలా వచ్చి మంచం మీద కూర్చున్నారు. నేనేమీ తెలియనిదానిలా అటూ ఇటూ తిరుగుతున్నాను పనిమీద. బుజ్జగిస్తున్నట్లుగా, లాలిస్తున్నట్టుగా భుజం మీద చేతులేసి, 'మళ్ళీ ఉగాదికి నీకు నేను కొత్త వడ్డాణం ప్రెజెంట్ చేస్తానురా. అమ్మది బ్యాంకులో ఉందట లాకర్‌లో' అన్నారు. నేను 'సరే' నని తలూపాను. చిరునవ్వుతో మా వారు తన ఓటమిని అంత గొప్పగా చెప్తున్నందుకు నవ్వుకుంటూ.

చూస్తూ చూస్తూ సంవత్సరం గడిచిపోయింది. మళ్ళీ ఉగాది నాటికి పాపం మా వారు నాకు ప్రెజెంట్ చేసింది ఏడునెలల గర్భం. 'నవ్వుతూ ఒరేయ్ శైలూ! ఇప్పుడు ఈ పొట్టతో వడ్డాణం కొలత ఎలా తెలుస్తుందిరా? నా తప్పుకాదుగా. నెక్స్ట్ ఇయర్' అన్నారు ప్రేమగా. మావారు ఎంతో ప్రేమగా మాట్లాడుతున్నప్పుడు "ఏరా?' అని సంబోధిస్తారు. 'ఫరవాలేదులెండి' అని నవ్వుకుని ఊరుకున్నాను నేను వారి లాలనకి మురిసిపోతూ. డెలివరీ అయింది. మా ఐశ్వర్య పుట్టింది. నాకు బాగా ఒళ్ళొచ్చేసింది. బంగారం ధర ఆకాశాన్నంటుతోంది. మా వారికి నా కోరిక జోక్ అయిపోయింది. 'ఒరేయ్! ఇప్పుడు నీ నడుముకి సరిపడ్డ వడ్డాణం చేయించాలంటే కొన్ని కిలోల బంగారం కొనాలిరా! ముందు నువ్వు సన్నబడు. కొంచెం బంగారం ధర కూడా తగ్గనీ' అనేవారు. నేను సన్నబడలేదు. అదేమిటో ఎంత డైట్ చేసినా, అసలు బరువూ, లావూ తగ్గలేదు. మరో రెండేళ్ళకి మళ్ళీ షరా మామూలే! మళ్ళీ గర్భం! ఈసారి మా అభిషేక్ పుట్టాడు. నా లావు మాత్రం పర్మనెంట్‌గా అలాగే ఉండిపోయింది. బంగారం ధరా తగ్గలేదు. అదీ అలాగే ఉండిపోయింది. ఈలోగా అమ్మకూడా స్వర్గానికి వెళ్ళిపోయింది.

మధ్యలో ఎన్ని ఉగాదులు దొర్లిపోయాయో? మామూలుగా వడ్డాణం సంగతి తలుచుకోకపోయినా, ఉగాదినాడు మాత్రం తప్పక గుర్తుకొస్తుంది. వడ్డాణం, వడ్డాణం పెట్టుకొని ఆనందంగా గలగలా తిరిగే అమ్మ రూపూ జ్ఞాపకం వస్తుంది.

అందుకే నాకు ఉగాదంటే ఇష్టం. అమ్మ ఆ రూపంటే మరీ మరీ ఇష్టం! నా కోరిక తీరిపోయుంటే అమ్మ ఆ రోజు ప్రత్యేకంగా గుర్తొచ్చేది కాదేమో!

ఆ కోరిక తీరకపోవడమే, ఉగాదిపైన నా ఇష్టం అయ్యుండొచ్చు! ఇప్పటికీ.

*  *  *